బీఆర్ఎస్ శ్రేణులకు అండగా ఉంటా

కార్యకర్తలతో కలిసి చాయ్ తాగుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మల్లాపూర్ మండల కేంద్రంలో కేడీసీసీబీ నూతన భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రారంభించారు. అనంతరం స్థానిక ఓ టీ స్టాల్ వద్ద పట్టణంలోని బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన చాయ్ తాగుతూ మాట్లాడారు. కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఏమైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.

-మల్లాపూర్, మే 12

కొండగట్టులో గిరి ప్రదక్షిణ

కొండపైకి పాదయాత్రగా వస్తున్న భక్తులు

మల్యాల, మే 12: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానంలోని ఆలయ పరిసరాల చుట్టూ గల కొండచుట్టూ గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని చిలుకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి ఆత్మారాం సురేశ్ మహరాజ్ నేతృత్వంలో సోమవారం నిర్వహించారు. కొండగట్టు దిగువన గల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రారంభమైన గిరిప్రదక్షిణ ఘాట్‌రోడ్ ద్వారా కొండపైకి వచ్చి నూతనంగా ఏర్పాటు చేసిన మార్గం ద్వారా 8 కిలోమీటర్ల మేర కొనసాగి కొండగట్టుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో దీక్షాపరులతో పాటు హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం

జగిత్యాల, మే 12: జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో ప్రభుత్వ నర్సింగ్ అధికారులు, టీఎన్జీవో ప్రతినిధులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికిరణ్, జిల్లా జనరల్ సెక్రటరీ సుజన్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దామోదర్, జాయింట్ సెక్రటరీ రాజేందర్, రాష్ట్ర, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి శేఖర్, అడ్వైజర్ వెంకట్ సుబ్బయ్య, సుమన్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మోతెవాడ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ స్వాతి-లక్ష్మణ్ నర్సులతో కేక్ కట్ చేయించి, సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ అధికారి దివ్యభారతి, ఏఎన్ఎంలు మాదేశి శిరీష, పద్మ, జ్యోతి, నాగరాణి, ఉజ్వల, భారతి, రాధిక, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ కళావతి, డిప్యూటీ నర్సింగ్ ఆఫీసర్ విజయమ్మ, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్లు కమల, అనిత, సుభాషిణి, నర్సులు దరున్ సింగ్, శివకుమార్‌కు సీనియర్ సిటీజన్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్, సామాజిక సేవకుడు రాజా గోపాల్ చారి ఉత్తమ సేవా పురస్కారాలు అందజేసి, పట్టు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ ఫోరం నాయకులు విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్ రావు, డాక్టర్లు, నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.

రాయికల్, మే 12: రాయికల్ ప్రభుత్వ దవాఖానలో వైద్య సిబ్బందిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెమొంటో, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ వొడ్నాల శశికాంత్ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, రమేష్, భూమయ్య, కడుకుంట్ల నరేశ్, నర్సయ్య, సుదర్శన్ రెడ్డి, ప్రసాద్, రాంప్రసాద్, నవీన్, శ్రీనివాస్, డాక్టర్ రజిత, డాక్టర్ అనిల్, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్ పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి

మల్లాపూర్, మే 12: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామంలో సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అలాగే సాతారం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, గౌడ, సర్వాయిపాపన్న సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పోలాండ్‌లో మల్యాల వాసి మృతి

మల్యాల, మే 12: మల్యాల మండల కేంద్రానికి చెందిన పొన్నం మనోజ్‌గౌడ్ (28) ఉపాధి కోసం పోలాండ్ వెళ్లాడు. సోమవారం ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ విధులకు వెళ్తున్న క్రమంలో అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అందరితో కలివిడిగా ఉండే మనోజ్ మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా ప్రభుత్వ అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

ఏపీపీకి సత్కారం

మెట్‌పల్లి, మే 12: మెట్‌పల్లి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా ఇటీవల నియమితులైన చెర్లపల్లి ఆనంద్‌గౌడ్‌ను సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తొగిటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మేడిపల్లి, మే 12: మేడిపల్లి మండలం కాచారం గ్రామానికి చెందిన సంకోజి గంగారాంకు రూ. 30 వేలు, పూదరి రాజేశ్‌కు రూ. 24 వేల చొప్పున సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, లబ్ధిదారులకు సోమవారం మాజీ సర్పంచ్ చిట్యాల సురేశ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

జగిత్యాల/కోరుట్ల, మే 12: దేశవ్యాప్తంగా ఈనెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఏఐయూటీసీ రాష్ట్ర నాయకుడు సమ్మయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ఆయన సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ ముక్రమ్, సాయిశ్వరి, వెన్న మహేశ్, కిరణ్, సుమలత, వనిత, మమత, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహేందర్ పాల్గొన్నారు. అలాగే, కోరుట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మున్సిపల్ కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్‌కు మున్సిపల్ కార్మికులు సమ్మె నోటీస్ అందజేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కథలాపూర్, మే 12: అస్సాం గవర్నర్ శ్రీలక్ష్మణ్‌ప్రసాద్ ఆచార్య చేతుల మీదుగా అంతర్జాతీయ బుద్ధిపీస్ అవార్డు అందుకున్న శ్రీగద్దె నరహరిని సోమవారం చింతకుంటలో రామాలయం కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇక్కడ రామాలయం కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లతో కలిసి కేడీసీసీబీ నూతన భవనాలు ప్రారంభం

కోరుట్ల: పట్టణంలో కేడీసీసీబీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల/ మల్లాపూర్, మే 12: కేడీసీసీబీ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కోరారు. కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్డు, మల్లాపూర్ మండల కేంద్రంలో నిర్మించిన కేడీసీసీబీ నూతన భవనాలను సోమవారం ఆయన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లతో కలిసి ప్రారంభించారు. ఆయా చోట్ల కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ, సహకార బ్యాంక్‌ల ద్వారా రైతులకు తక్కువ వడ్డీకే రుణాలందిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థుల చదువు కోసం రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నామని, కోరుట్ల కేడీసీసీబీ రూ. 205 కోట్ల టర్నోవర్ సాధించినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే జిల్లా కేడీసీసీబీ రుణాల మంజూరులో ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ, జిల్లాలో సహకార సంఘాలు నిలదొక్కుకోవడానికి కొండూరి రవీందర్‌రావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జిల్లా కేడీసీసీబీ రూ. 10 వేల కోట్ల టర్నోవర్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కేడీసీసీబీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కోరుట్లలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, బ్యాంక్ మేనేజర్ మున్వర్, కేడీసీసీబీ డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు ఎలిశెట్టి భూంరెడ్డి, సింగిరెడ్డి నర్సారెడ్డి, ఆదిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, భూమయ్య, సాయిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చీటి వెంకట్రావు, సింగిరెడ్డి నారాయణ రెడ్డి, మల్లాపూర్‌లో కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, సహకార సంఘం చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, బద్దం అంజిరెడ్డి, నేరెళ్ల మోహన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ నరేశ్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గోదాములు ప్రారంభం

కోరుట్ల రూరల్, మే 12: రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రాథమిక సహకార సంఘాలు ఎంతో కృషి చేస్తాయని కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. మండలంలోని సర్వరాజ్‌పూర్, పైడిమడుగు, జోగన్‌పల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన ఎరువుల గోదాములను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బ్యాంకు సేవలను రైతులతో పాటు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, జిల్లా సహకార సంఘాల ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నర్సారెడ్డి, సహకార సంఘాల అధ్యక్షులు జగన్‌మోహన్‌రావు, భూంరెడ్డి, ఆదిరెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్రావ్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణపై పునరాలోచించాలి

వినతిపత్రం ఇస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, మే 12: ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఆమె కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ, ఎస్‌యూ 6వ సెమిస్టర్ పరీక్షల నిర్వహణపై గందరగోళం ఏర్పడిందన్నారు. ఈ నెల 14 నుంచి పరీక్షల షెడ్యూల్ విడుదల చేయడం, నేటికీ హాల్ టికెట్లు రాక విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మహేశ్, అర్బన్ మండలాధ్యక్షుడు తుమ్మ గంగాధర్, రాయకల్ మండలాధ్యక్షుడు బర్కం మల్లేశ్, కో-ఆర్డినేటర్ శ్రీధర్, నాయకులు వెంకటేశ్వర్ రావు, గంగాధర్, రిజ్వాన్, హరీశ్, ప్రణయ్, ప్రతాప్, భగవాన్, సాయి వెంకట్ పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

కోరుట్ల రూరల్, మే 12: మండలంలోని జోగన్‌పల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు, రైతులు, హమాలీలకు వైద్య సిబ్బంది సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐరన్, కాల్షియం ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ కూలీలకు జాగ్రత్తలను వివరించి మాత్రలు అందజేసినట్లు ఏఎన్ఎం రాజేశ్వరీ తెలిపారు.

బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ

దుంపేటలో మాజీ ఎంపీటీసీ రమేశ్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

కథలాపూర్, మే 12: మండల కేంద్రంలో పల్లికొండ అజయ్, దుంపేటలో మాజీ ఎంపీటీసీ మల్యాల రమేశ్ సోదరుడు శేఖర్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాలను సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. అలాగే, దుంపేటలో చెదలు లక్ష్మి, రాజారాంతండాలో బీఆర్ఎస్ నాయకుడు మెగ్యానాయక్, భూక్యారెడ్డి, కళావతి, చింతకుంటలో పెడిమెల్లి గంగారాం, జెజ్జారపు లక్ష్మీనర్సయ్య, దూడ రాజం, కాటుపెల్లి చిన్నభూమారెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, నాయకులు మామిడిపెల్లి రవీందర్, బొడ్డు బాలు, వంగ రవీందర్, సోమ దేవేందర్ రెడ్డి, రవినాయక్, ఎండీ రఫీ, ఏజీబీ మహేందర్, జెల్ల వేణుగోపాల్‌యాదవ్, చెక్కపెల్లి రాజ్‌కుమార్, దొప్పల జలేందర్, జవిడి ప్రతాప్‌రెడ్డి, ఓంకార్, గణేశ్ తదితరులున్నారు.

ఎప్‌సెట్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రభంజనం

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నరేందర్ రెడ్డి

జగిత్యాల, మే 12: జగిత్యాలలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఎప్‌సెట్-2025 ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో ప్రతిభ చూపి మంచి ర్యాంక్‌లు సాధించారు. ఎం మధు 1551 ర్యాంక్, ఈ అంకిత్ సాయి 3005, డీ గోపిక హర్షిత 3156, ఈ వర్షిత్ 4518, జీ సాకేత్ 5881, పీ అభినవ్ 7606, ఎస్ సిద్ధార్థ 8399, కే గ్లాడిస్ 11007, సన్నిధి 15167, ఎన్ రాము 15906వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను సోమవారం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి అభినందించారు. ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

సారంగాపూర్, మే 12: బీర్‌పూర్ మండలం కండపల్లి గ్రామంలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా పొలాస వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎన్ మహేశ్, డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ, ఎరువుల వినియోగం, తక్కువ యూరియా వాడి సాగు ఖర్చులు తగ్గించుకోవడం, అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం, భూసార పరీక్షలు చేయడం, సాగు నీటిని ఆదా చేయడం, పంట మార్పిడి విధానం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వినోద్, రైతులు పాల్గొన్నారు.

యాదవ హక్కులు సాధించుకుంటాం

సారంగాపూర్, మే 12: జిల్లాలో యాదవులను చైతన్యవంతం చేయడంతో పాటు యాదవ హక్కులను సాధించుకుంటామని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కోనాపూర్ గ్రామంలో సోమవారం ఆయన యాదవులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ, జిల్లాలో యాదవ సంఘాన్ని బలోపేతం చేసి హక్కులను సాధించుకుంటామన్నారు. అనంతరం యాదవ సంఘం సభ్యత్వాలను నమోదు చేసి, రసీదులు అందజేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పన్నాల హరీశ్, సారంగాపూర్ మండల ఇన్‌చార్జిగా కొమురయ్యను నియమించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు యాదవనేని రాజలింగం, రెబ్బిస్ మల్లయ్య, చిర్రం గంగయ్య, భీమయ్య, చెంది చిన్న కొమురయ్య, గంగాధర్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తూకంలో మోసం

ధర్మపురి, మే 12: తిమ్మాపూర్ ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాయపట్నం ధాన్యం కొనుగోలు కేంద్రంలో సిబ్బంది మిల్లర్లతో కుమ్మక్కై 40 కిలోలు తూకం వేయడానికి బదులు 44.50 కిలోలు తూకం వేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. రైతులు ఉన్న సమయంలో 42 కిలోలు, రైతులు పక్కకు జరిగితే 44 కిలోలకు పైగా తూకం వేస్తూ మోసం చేస్తున్నారు. గతంలో తప్పులు జరిగాయి, అలాంటి తప్పులు జరగనివ్వమని చెప్పిన పాలకులు ఇంత జరుగుతున్నా వారిపై చర్యలు తీసుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు

మెట్‌పల్లి టౌన్, మే 12: పట్టణంలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను మున్సిపల్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. పరిశుభ్రత పాటించకుండా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న సెంటర్లకు రూ.1,500 జరిమానాలు విధించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మోహన్ హెచ్చరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు, ముజీబ్, తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

పెగడపల్లి, మే 12: పెగడపల్లి మండలం దోమలకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులను సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురకంటి సత్తిరెడ్డి, డైరెక్టర్లు చెట్ల కిషన్, దేశెట్టి లక్ష్మీరాజం, నాయకులు అనిల్‌గౌడ్, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ

ఇబ్రహీంపట్నం, మే 12 : మండలంలోని డబ్బా గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సోమవారం ఆవిష్కరించారు. విగ్రహదాత చర్లపల్లి అనిల్‌దీప్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న గౌడ సంఘం నాయకులు మల్లేశంగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం, మే 12: మండలంలోని మేడిపల్లి, బండలింగాపూర్, రాజేశ్వర్‌రావుపేట, చెర్లకొండాపూర్, సత్తక్కపల్లి, ఎర్రాపూర్, అమ్మక్కపేట, డబ్బా గ్రామాలకు మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రశాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కనకదుర్గాదేవికి ప్రత్యేక పూజలు

రాయికల్, మే 12: భారత దేశానికి, సైనికులకు ఉగ్రవాదుల నుంచి ఎలాంటి హాని కలుగకూడదని మైతాపూర్ శివారులోని కనకదుర్గాదేవి ఆలయంలో మూలవిరాట్‌కు పూజలు చేశారు. ఈ సందర్భంగా 108 కళాశాలతో పంచామృతాభిషేకాన్ని అర్చకుడు క్యాషనూరి మఠం జగదీశ్వర్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంగ మల్లయ్య, సభ్యులు బాలయ్య, లింగారెడ్డి, గంగారం, భక్తులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

జగిత్యాల కలెక్టరేట్, మే 12: తాగి వాహనం నడిపిన వ్యక్తికి జగిత్యాల స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం తెలిపారు. పట్టణంలో వాహనాల తనిఖీలు చేపట్టగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాచానూరు కొండయ్య తాగి వాహనం నడుపుతూ దొరికినట్లు పేర్కొన్నారు. కోర్టులో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం

కోరుట్ల, మే 12: పట్టణంలోని ఐబీ గెస్ట్ హౌస్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర జలకడుగు సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కోరుట్లకు చెందిన చెరుకు సమ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కట్కూరి కాళీ, జమ్మిండ్ల రాజు, ప్రధాన కార్యదర్శులుగా జల్లి యేసు, మజ్జిగ వెంకటేశ్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా జిల్లా పద్మ, ఉపాధ్యక్షురాలిగా గుర్రపు పోనమ్మ, కార్యదర్శిగా దొంతి మంగ, రాష్ట్ర యూత్ విభాగం అధ్యక్షుడిగా మామిడి బ్రహ్మయ్య, ఉపాధ్యక్షుడిగా అగ్గల్ల వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా విష్ణు సత్యనారాయణ, కార్యదర్శిగా వీరభద్ర శేఖర్, కోశాధికారిగా జమీన్ల మహేశ్ ఎన్నికయ్యారు.

పేద విద్యార్థులకు చేయూత

మారుతీనగర్, మే 12: మెట్‌పల్లి పట్టణానికి చెందిన శివరామకృష్ణ-శిరీష దంపతుల కుమారుడు ఇటీవల ప్రమాదశాత్తు మృతి చెందాడు. ఆయన జ్ఞాపకార్థం నలుగురు పేద విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరానికి సరిపడా నోటుబుక్స్, ఇతర సామగ్రి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నంబి రాజేందర్‌శర్మ, నంద కిశోర్, బాబు, లక్ష్మీనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆత్మీయ సత్కారం

మారుతీనగర్, మే 12: మెట్‌పల్లికి చెందిన మెడిచెల్మ సహస్ర ఆర్మీ గర్ల్స్ స్పోర్ట్స్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపింది. కాగా, సోమవారం చిన్ననాటి గురువు నంబి రాజేందర్‌శర్మ దంపతులు సహస్రను శాలువాతో సత్కారించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

మెట్‌పల్లి రూరల్, మే 11: నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు ఏర్పడితే వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల విద్యుత్ అధికారులను ఆదేశించారు. మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన నియోజకవర్గ విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరాకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వ్యవసాయ, గృహ వినియోగదారులకు అధికారులు మెరుగైన విద్యుత్ సేవలందించాలని సూచించారు. అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని చిన్నపాటి వర్షానికే విద్యుత్ నిలిచిపోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీఈ గంగారాం, మెట్‌పల్లి, కోరుట్ల ఏడీఈలు మనోహర్, రఘుపతి, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

లఘు చిత్రం ఆవిష్కరణ

జగిత్యాల, మే 12: కృష్ణ చైతన్య ట్యూన్స్, యుట్యూబ్ చానెల్ ఆధ్వర్యంలో తీసిన 'నాన్న వచ్చేయ' లఘు చిత్రాన్ని జిల్లా విద్యాధికారి రాము సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్ రావు, అమర్నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బడిబాట

కథలాపూర్, మే 12: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని నాయకులు, ఉపాధ్యాయులు కోరారు. సోమవారం మండలంలోని చింతకుంట, రాజారాంతండా గ్రామాల్లో ముందస్తుగా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, ఉపాధ్యాయులు, మహిళలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం అర్జున్, రవి, సుధాకర్, జగన్, శేఖర్, నల్ల రాజయ్య, శ్రీనివాస్, కృష్ణారావు, సతీశ్, బాలకిషన్, వెంకటేశ్వరబాబు, పరమేశ్వర్, మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు పాల్గొన్నారు.

జనుము, జీలుగ విత్తనాలు విక్రయించవద్దు

పెగడపల్లి, మే 12: పెగడపల్లి, నంచర్ల, నందగిరి సహకార సంఘాల్లో జనుము, జీలుగ విత్తనాలను ఇప్పుడే విక్రయించవద్దని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాల నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేసేందుకు పరీక్ష నిమిత్తం కరీంనగర్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో విత్తనాల నాణ్యతకు సంబంధించి నివేదిక వస్తుందని, అవి నాణ్యమైనవని తేలితేనే సహకార సంఘాలు వాటిని రైతులకు విక్రయించాలని స్పష్టం చేశారు. మండలంలో విత్తనాలకు కొరత లేదని తెలిపారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పెగడపల్లి, మే 12: నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉల్లాస్ కార్యక్రమంపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, ఎంఈవో సులోచన, ఐకేపీ ఏపీఎం సమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి, ఆర్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

కథలాపూర్, మే 12 : గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించాలని ఎంఈవో లోకిని శ్రీనివాస్ మహిళా సంఘాల ప్రతినిధులకు సూచించారు. కథలాపూర్‌లోని ఐకేపీ కార్యాలయంలో మండలంలోని మహిళా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పల్లె దవాఖానతో మెరుగైన వైద్య సేవలు

రాయికల్, మే 12: పల్లె దవాఖానలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని అయోధ్య, అల్లీపూర్ గ్రామాల్లో నిర్మించిన పల్లె దవాఖానాల భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. అయోధ్యలో పల్లె దవాఖానకు స్థలం ఇచ్చిన ప్రభాకర్ రెడ్డి, శ్రీరంగ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, వినోద్ రెడ్డిని ఎమ్మెల్యే సత్కరించారు. అలాగే, అయోధ్యలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ఎంపీడీవో చిరంజీవి, డీఈ మిలింద్, ఎంపీవో సుష్మా, ప్యాక్స్ చైర్మన్లు రాజిరెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, రాజలింగం, మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హనుమాండ్లు, నాయకులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన

జగిత్యాల, మే 12: జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి నుంచి గాంధీనగర్-చల్‌గల్ వరకు రూ.18 కోట్లతో బ్లాక్ స్పాట్ రోడ్డు మంజూరైంది. కాగా, గాంధీనగర్ వద్ద పాత వంతెనను పూర్తిగా తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నూతన డైవర్షన్ రోడ్డు ఏర్పాటు కోసం వంతెనను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాలే శంకర్, నాయకులు అడువాల లక్ష్మణ్, పంబాల రాముకుమార్, నేషనల్ హైవే ఈఈ మల్లారెడ్డి, డీఈ గులాబ్ సింగ్, ఏఈ సలావుద్దీన్, నాయకులు జావేద్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను వెల్దుర్తి గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కలిశారు. వెల్దుర్తిలో ఎల్లమ్మ ఆలయానికి సీసీ రోడ్డు, గుడిలో వంటశాల షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, కాటమయ్య రక్షణ కిట్లు అందజేయాలని వినతిపత్రం అందజేశారు.

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమివ్వాలి

జగిత్యాల, మే 12: ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యమిచ్చి క్షేత్రస్థాయిలో వెంటవెంటనే పరిష్కారం చూపాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. కాగా, ప్రజావాణికి మొత్తం 30ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఇక్కడ అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, జివాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

వెల్గటూర్, మే 12: వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని వెల్గటూర్ ఏఎంసీ చైర్‌పర్సన్ గుండాటి గోపిక-జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లోని పలు కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ధాన్యాన్ని తూకం వేసి, మిల్లులకు తరలించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్లు మహిపాల్‌రెడ్డి, సంజీవ్, శ్రీనివాస్, తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I Thammanaveni Sadaiah S/o. Yellaiah, H.No. 1-12, Village, Kukkalagudur, Palakurthy Mandal, Peddapalli District. Have Changed My Name As Thammanaveni Sadankumar Yadav S/o. Yellaiah.

పేరు మార్చబడినది
నేను సంజీవ్ నూతుల S/o. నూతుల కిష్టరెడ్డి (పాత పేరు) వయస్సు:50 సం||రాలు, ఇ.నెం. 7-86/1, రేచపల్లి , సారంగపూర్ మండలం జగిత్యాల జిల్లా తెలంగాణ. నా పేరు మార్చబడినది . నూతుల సంజీవరెడ్డి S/o. నూతుల క్రిష్టారెడ్డి (కొత్త పేరు)

PASSPORT LOST
★ Namala Mohan S/o.Namala Mallaiah H.No. 5-35, RR Colony, Anupuram,Vemulawada Mandal, Rajanna Sircilla Dist. My Pass Port No. E5597998 Lost Travelling by Bike From Anupuram to Vemulawada any one find Please Call : 9440050092
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.